సాక్షి
గుంటూరు
బుధవారం | 4 | డిసెంబర్ | 2024



జెడ్పీ చైర్‌పర్సన్‌తో ఎమ్మెల్యే భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్: అభివృద్ధి పనులపై నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మంగళవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో చర్చించారు.



బాబు రాజేంద్రప్రసాద్‌కు నివాళి

నరసరావుపేట రూరల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవం, బాబు రాజేంద్ర ప్రసాద్ జయంత్యుత్సవాన్ని కేసానుపల్లి జవహర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు.



పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు

బొల్లాపల్లి: రెడ్డిపాలెంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సమష్టి దివ్య పూజా బలి నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఫిరంగిపురంలో 17.8 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 17.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.2 మి.మీ. పడింది. సగటు 5.2 మి.మీ.గా నమోదైంది. మండలాలవారీగా ప్రత్తిపాడులో 16.4, కాకుమాను 15.4, పొన్నూరు 9.6, గుంటూరు పశ్చిమ 9.4, గుంటూరు తూర్పు 8.2, పెదనందిపాడు 7.4, చేబ్రోలు 5.2, మేడికొండూరు 2.2, పెదకాకాని మండలంలో 1.6 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1,902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 150 , తూర్పు కెనాల్‌కు 45 , పశ్చిమ కెనాల్‌కు 80, నిజాంపట్నం కాలువకు 278 , కొమ్మమూరు కాలువకు 1293 క్యూసెక్కులు వదిలారు.

యార్డుకు 42,929 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 42,929 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 40,893 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 39,454 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

నేడు నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం

బాపట్ల: వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం బుధవారం బాపట్లలో నిర్వహిస్తునట్లు జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కోన చాంబర్‌లో ఈ సమావేశం ఉంటుందని ఆయన చెప్పారు. జిల్లా కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

పులిచింతల వద్ద ఆక్టోపస్ మాక్ డ్రిల్



అచ్చంపేట: తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు ప్రాంతం పులిచింతల ప్రాజెక్టుల వద్ద ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్(ఆక్టోపస్) అధికారులు మంగళవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, విధులు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అడిషనల్ ఎస్పీ ఎ.రాజారెడ్డి టీం సభ్యులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ముందుగా మాదిపాడులోని జెడ్పీ హైస్కూలులో టీమ్ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం పులిచింతల ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద సంస్థలు దాడులు నిర్వహించినప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆస్తులను, కట్టడాలను ఏవిధంగా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మందికి పైగా టీమ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ ఎ.ఎస్.రంగబాబు, ఆర్ఐస్ శ్రీకాంత్, శివప్రసాద్, రామచంద్రానాయక్, ఇరిగేషన్ ఏఈ, మెడికల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





తడిసిన ధాన్యం.. రైతుల దైన్యం

ఒకవైపు వాతావరణం కరుణించక, మరోవైపు కూటమి సర్కారు ధాన్యం కొనుగోళ్లలో కనికరం లేకుండా వ్యవహరించడం అన్నదాతలకు వేదనే మిగులుస్తోంది. అప్పోసప్పో చేసి ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేవరకు కంటికి రెప్పలా కాపాడుకునేందుకు వారు పడుతున్న యాతన అంతా ఇంతా కాదు. చిత్రంలో తెనాలి నియోజకవర్గం, కొల్లిపర మండలంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతుల దయనీయ పరిస్థితి చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

దివ్యాంగులకూ ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

నెహ్రూనగర్: సమాజంలో దివ్యాంగులకు కూడా అన్ని అంశాల్లో భాగస్వామ్యం కల్పించి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు వారికీ అందేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్పెషల్ ఎడ్యుకేషన్, భవిత సెంటర్‌ల ద్వారా ప్రభుత్వం వీరికి చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉన్నత చదువులకు వీలుగా హాస్టల్ ఏర్పాటు చేశామన్నారు. స్కాలర్ షిప్‌లు అందిస్తున్నట్లు వివరించారు. పింఛను ద్వారా ఆర్థిక భరోసా ఇస్తున్నట్లు వెల్లడించారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ముందుగా విభిన్న ప్రతిభావంతులైన పిల్లలతో కలెక్టర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిలు కేక్ కట్ చేయించారు.



చెస్ ఆడుతున్న విభిన్న ప్రతిభావంతులు

చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు ఆకట్టుకున్నాయి. ముగ్గురు చొప్పున విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు బహూకరించారు. వివిధ అసోసియేషన్‌ల సభ్యులను, ఎన్జీఓలను సత్కరించారు. గ్రంథాలయ చైర్మన్ కోటేశ్వరరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, డీఎంహెచ్‌ఓ డా. విజయలక్ష్మి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దుర్గాబాయి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ సేవా సంస్థల సభ్యులు, ఎన్జీఓల ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



షాట్‌పుట్ విసురుతున్న బాలిక

వెట్టి చాకిరి నుంచి కార్మికులకు విముక్తి



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కార్మికులు, వారి కుటుంబసభ్యులు తదితరులు

నగరంపాలెం: ఊరు కాని ఊరు.. తెలియని భాషతో వెట్టిచాకిరి చేస్తున్న వలస కార్మికులు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చొరవతో ఎట్టకేలకు స్వస్థలాలకు చేరుకున్నారు. క్షేమంగా గుంటూరు చేరిన వారు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో మంగళవారం జిల్లా ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలు క్రితం గుంటూరు నగరంలోని శివనాగరాజు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, మిర్చియార్డు ప్రాంతాల్లోని పది మందికిపైగా కార్మికులు తాపీ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఆ పనులు ముగిశాక మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని గెవ్రాయ్ గ్రామం చేరుకున్నారు. అక్కడ యజమాని డ్రైనేజీ

ఎస్పీ చొరవతో గుంటూరుకు బాధితులు

పనులు చేయిస్తున్నాడు. తగిన వసతి కల్పించకుండా అర్ధాకలితో పనులు చేయించాడు. పారిపోయేందుకు ప్రయత్నించే వారిని కొట్టేవారు. ఎట్టకేలకు వారిలో ఒకరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో జిల్లా ఎస్పీ దృష్టికి విషయం చేరింది. నగరంపాలెం పీఎస్ ఎస్ఐ బాషా బృందం బాధితులను తీసుకొచ్చింది. రూ.93 వేల వేతనాన్ని కూడా యాజమాని నుంచి ఇప్పించారు. నగరంపాలెం పీఎస్ ఎస్ఐ బాషా, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



విజయనగరంలో నిగర్ సుల్తానా స్టాల్‌ను సందర్శించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

సృజన వనిత.. స్ఫూర్తి ఘనత

సుభానల్లా గ్రూప్... స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో దేశంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్లలో ఇప్పుడు తరచూ వినిపిస్తున్న పేరు ఇది. గుంటూరు నుంచి ఢిల్లీ వరకు ఎక్కడ చేతి ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటైనా తెనాలికి చెందిన ఈ గ్రూపు ఉండాల్సిందే. ఈ విజయం వెనుక నహారే నిగర్ సుల్తానా ఉన్నారు. ఆర్థిక స్వావలంబనకు అచ్చమైన నిదర్శనం ఆమె.

- వేదికేదైనా చేతి ఉత్పత్తుల విక్రయంలో ప్రత్యేకత
- 'ముత్యాల' మెరుపులతో ఆర్థిక స్వావలంబన
- ఆదర్శంగా నిలుస్తున్న నహారే నిగర్ సుల్తానా

తెనాలి: ముత్యాలతో తీర్చిదిద్దిన హ్యాండ్‌బ్యాగ్‌లు, సముద్రపు గవ్వలతో చేసిన గృహోపకరణాలు చూపరుల మనసు దోచుకోవాల్సిందే. అత్యధిక అమ్మకాలతో అవార్డులూ అందుకోవాల్సిందే. నహారే నిగర్ సుల్తానా.. తనలోని సృజనకు శిక్షణతో మెరుగులు దిద్దుకుని పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తెనాలిలోని పినపాడుకు చెందిన వీరిది దిగువ మధ్యతరగతి కుటుంబం. పదేళ్ల క్రితం స్వయం సహాయక సంఘంలో ఆమె చేరారు. అప్పట్లో ప్రకాశం జిల్లా కనిగిరిలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిసి వెళ్లారు. అక్కడ నైపుణ్యం సంపాదించారు. తిరిగొచ్చాక భర్తకూ నేర్పించారు. గ్రూపులోని నలుగురు సభ్యులూ వీరికి తోడయ్యారు. గత అక్టోబరులో 'మెప్మా' ఆధ్వర్యంలో విజయనగరంలో అఖిల భారత డ్వాక్రా బజారు ఏర్పాటైంది. పది రోజుల్లోనే వీరి స్టాల్‌లో రూ.2.70 లక్షలు విలువై సరకు విక్రయించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లోనూ పాల్గొన్నారు. 'ఆనర్ హాట్' నిర్వహించే ట్రేడ్ ఫెయిర్లలో ఉత్తర ప్రదేశ్‌లోని రామ్‌పూర్‌లో రెండుసార్లు, ఢిల్లీలో మరోసారి స్టాల్ నడిపారు. మెప్మా ఆధ్వర్యంలో ఢిల్లీ ఎగ్జిబిషనులో ఉత్పత్తుల స్టాల్ పెట్టారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, అమలాపురం, గుంటూరు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఎగ్జిబిషన్లలోనూ జోరుగా విక్రయాలు జరిగాయి. మహిళల అభిరుచులకు తగినట్టుగా కొత్త ఉత్పత్తులు రూపొందించడమే కాకుండా మరికొన్ని ఫ్యాన్సీ ఐటమ్స్‌ను హోల్‌సేల్‌లో తీసుకుని స్టాల్‌లో ఉంచుతున్నామని నిగర్ సుల్తానా చెప్పారు. కష్టం చాలా ఉన్నా... ఆదాయం కూడా సంతృప్తికరంగా ఉందన్నారు. పెద్ద కుమారుడు విజయవాడలో ఇంటర్, చిన్న కుమారుడు తెనాలిలోని మున్సిపల్ హైస్కూల్లో పదోతరగతి చదువుతున్నారని చెప్పారు.



క్రిస్టల్ ఉత్పత్తుల తయారీలో నిగర్ సుల్తానా తదితరులు



రాష్ట్ర స్థాయిలో ఎక్కువ విక్రయాలకుగాను అభినందనలు అందుకుంటున్న నిగర్ సుల్తానా

మన 'దీక్ష'.. మెరిసింది!

- క్రికెట్‌లో సత్తా చాటుతున్న గుంటూరు బాలిక
- బీసీసీఐ అండర్–15 టోర్నీలో వెలుగులోకి ప్రతిభ
- తల్లిదండ్రుల ప్రోత్సాహానికి తోడు కష్టపడేతత్వంతో రాణింపు



దీక్షను అభినందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్ కుమార్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కొంచెం ఊహ వచ్చిన తర్వాత పిల్లలతో తల్లిదండ్రులు గడిపే సమయం కాలక్రమేణా తగ్గిపోతోంది. అందుకే వారు స్నేహితులపైనా, సెల్‌ఫోన్స్‌లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌పై ఎక్కువ ఆధారపడుతుండడం మనం తరచూ చూస్తుంటాం. పిల్లలకు చిన్న చిన్న విషయాలు తెలుస్తున్న సమయంలో వారితో ఎక్కువ టైం గడిపితే వారిలోని అభిరుచులు, అలవాట్లు తెలుసుకునే వీలుంటుంది. ఇదే చేశారు ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన కాట్రగడ్డ శేషసాయి, హేమ ప్రభ దంపతులు. తమ ఒక్కగానొక్క కుమార్తె దీక్షను చిన్న వయస్సులోనే క్రికెట్ ఆటలో చేర్పించి మార్గదర్శకులుగా మారారు. అందుకే దీక్ష కేవలం 13 సంవత్సరాల వయస్సులోనే బీసీసీఐ అండర్–15 బాలికల క్రికెట్‌లో సత్తా చాటి ఆంధ్ర జట్టు విజేతగా నిలపడంలో కెప్టెన్‌గా కీలక భూమిక పోషించింది. ఓపెనర్‌గా బ్యాటింగ్ చేయడమే కాదు, వికెట్ కీపర్‌గానూ రాణించి శెభాష్ అనిపించుకుంది.

బ్యాటింగ్‌లో మెరుపులు, కీపింగ్‌లో సూపర్ స్టంపింగ్‌లు



బీసీసీఐ అండర్–15 పూల్ ఎఫ్ విజేతగా నిలిచిన ఆంధ్ర జట్టు సభ్యులతో కెప్టెన్ దీక్ష

కన్నవారి ప్రోత్సాహంతో...

దీక్ష తండ్రి శేషసాయి ఒకప్పుడు క్రికెటర్. చిన్నప్పుడు సరదాగా తండ్రి బైక్‌పై గ్రౌండ్‌కి వెళ్లిన దీక్షకు క్రికెట్‌పై మక్కువ ఏర్పడింది. దీంతో తల్లిదండ్రులకు క్రికెట్ నేర్చుకుంటానని చెప్పింది. ఆడపిల్లకు, అదీ ఒక్కగానొక్క కుమార్తెకు క్రికెట్ ఎందుకని అనుకోలేదా తల్లిదండ్రులు. వెంటనే ఓనమాలు నేర్పించారు. స్వతహాగా తెలివి, పట్టుదల కలిగిన దీక్షకు అతి త్వరలోనే ఆటపై పట్టు చిక్కింది. దీక్ష అండర్–13 జిల్లా, జోనల్ క్రికెట్‌లో రాణించడంతో గత నెలలో జరిగిన బీసీసీఐ అండర్–15 బాలికల టోర్నీకి ఆంధ్ర జట్టుకు ఎంపిక చేశారు. కెప్టెన్‌గా కూడా అవకాశం దక్కింది. దేశ వ్యాప్తంగా మొత్తం 6 పూల్స్‌లో జరిగే ఈ టోర్నీలో ఆంధ్ర జట్టుకు పూల్ ఎఫ్ కేటాయించారు. ఆ టోర్నీలో ఆంధ్ర జట్టు అన్ని జట్లపైనా విజయం సాధించి విజేతగా నిలిచింది. దీంతో నేరుగా ఆంధ్ర జట్టుకు బీసీసీఐ తదుపరి టోర్నీకి క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసింది. ఈ క్రమంలో దీక్ష మహారాష్ట్రపై 52, ఉత్తరాఖండ్‌పై 92, హిమాచల్‌ప్రదేశ్‌పై 47 నాటౌట్, పుదుచ్చేరిపై 54, మేఘాలయపై 114 పరుగులు చేసింది. కీలకమైన రన్ అవుట్స్, స్టంపింగ్స్, క్యాచ్‌లు పట్టి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించింది. మంగళవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణమూర్తి, దాసరి రమేష్ కుమార్‌లు దీక్షను అభినందించారు.



తల్లిదండ్రులే స్ఫూర్తి

నాన్నను చూసి క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నా. అమ్మ నాతో మ్యాచ్‌లకు వస్తుంది. నాకు ఏం కావాలన్నా తనే చూసుకుంటుంది. కేవలం నేను క్రికెట్ శ్రద్ధగా ఆడాలని మాత్రమే వారు చెబుతుంటారు. కోచ్‌ల సహకారం కూడా ఎంతో ఉంది. ఏసీఏతోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అన్ని విధాలుగా సహకరిస్తోంది. ముందు సీనియర్స్ విభాగానికి రావాలి. ఆ తర్వాత నాకంటూ లక్ష్యాలు పెట్టుకుంటా. పేరెంట్స్ సహకారం ఉంటే ఏ క్రీడలోనైనా రాణించవచ్చు.

– దీక్ష

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు మంగళవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన కొప్పిశెట్టి నాగసత్యవాణి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ డీఈవో ఎం. రత్నరాజు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

బంధమే బరువై.. ముదిమిలో ఒంటరై..

- నడిరోడ్డుపై వృద్ధుడిని వదిలేసిన కుటుంబం
- స్థానికుల సమాచారంతో ఆదుకున్న పోలీసులు



బాధితుడు

మంగళగిరి: ఒకవైపు చలి గజగజలాడిస్తోంది.. మరోవైపు మీద పడిన వయస్సులో నిలబడలేని పరిస్థితి.. దీనికంతటికీ కారణం ఆయన్ను బరువుగా భావించిన కుటుంబసభ్యులే. కని పెంచారనే ప్రేమ లేదు.. కనీసం మానవత్వంతోనైనా కనికరించనూ లేదు. ఆదివారం ఉదయం నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ప్రార్థనలకు వెళ్తున్న ప్రకాష్ అనే యువకుడు రోడ్డుపై చలిలో వణుకుతూ కనిపించిన వృద్ధుడిని గమనించి చలించిపోయారు. ఆయనకు తాగునీరు అందించి, వివరాలు కనుక్కునేందుకు యత్నించారు. సరిగా మాట్లాడలేక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. 108 వాహనానికి ఫోను చేశారు. తనను ఎవరో ఆటోలో తీసుకువచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లారని వృద్ధుడు తెలిపారు. విజయవాడ మల్లికార్జునపేటలో నివాసం ఉంటానని పేర్కొన్నారు. రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,700** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **3,300**

వైకల్యాన్ని అధిగమించిన వారికి చేయూతనిద్దాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి



కార్యక్రమంలో లీలావతి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరక వైకల్యంతో కష్టాలను ఎదుర్కొంటూ వాటిని జయించిన వారికి చేయూత ఇద్దామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ.. అందరికీ స్ఫూర్తినిస్తున్న విభిన్న ప్రతిభావంతులను గౌరవించి, సమాజంలో తోటివారిగా ఆదరించాలని పిలుపునిచ్చారు. గుంటూరు తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్నివిధాలా ప్రభుత్వం సాయం చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలకు వెళ్లే విభిన్న ప్రతిభావంతులైన పిల్లలతోపాటు వారికి అండగా ఉండే సహాయకులకు సైతం ప్రభుత్వం రవాణా అలవెన్సు ఇస్తుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతురాలైన ఉపాధ్యాయురాలు పాదిలి మేరీ రాజేశ్వరిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎంఈవో-2 జ్యోతి కిరణ్, పాఠశాల హెచ్‌ఎం జె.గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు కె.సుజాత, షేక్ ఆసియా భాను, భారతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతంలో జెడ్పీటీసీలదే కీలక పాత్ర

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి
- పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- కార్యకర్తలు గర్వపడేలా సాగిన వైఎస్ జగన్ పాలన
- పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. పక్కన మేరుగ, బొల్లా, గోపిరెడ్డి, మురళీకృష్ణ, డైమండ్‌బాబు తదితరులు

పట్నంబజారు: రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసే ప్రక్రియలో జెడ్పీటీసీలు కీలక పాత్ర పోషించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీటీసీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకమై వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సూచించారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాని తీరును ఎండగట్టాలన్నారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసే దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు పార్టీకి కట్టుబడి ఉన్నారని, భవిష్యత్తులో సైతం కూటమి అక్రమాలపై ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

మాజీ మంత్రి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి భుజానికెత్తుకున్న జెండాను కిందకు దించకుండా పోరాడుతున్న ప్రతి కార్యకర్త సగర్వంగా తలెత్తుకునేలా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన సాగిందన్నారు. వైఎస్ జగన్‌ను నమ్ముకున్న ప్రతి ఒక్కరికి ఉన్న అజెండా ఒక్కటేనని.. అది వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం అన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తాము వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారు.

ముఖ్య నాయకులు ఏమన్నారంటే...

- వినుకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ... పార్టీ ఓటమి చవిచూసిన తరువాత కూడా ఏ మాత్రం వెరువకుండా పార్టీ పటిష్టత కోసం పాటు పడుతున్న ఘనత జెడ్పీటీసీలకే దక్కుతుందన్నారు.
- నరసరావుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జెడ్పీటీసీలు రానున్న రోజుల్లో పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, గ్రామ నేతలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు.
- పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజంగానే ఉంటాయని గుర్తుచేశారు. కానీ నమ్ముకున్న సిద్ధాంతాల కోసం, తమకు పదవి ఇచ్చిన నాయకుడి కోసం పోరాడుతున్న ఘనత జెడ్పీటీసీలకే దక్కుతుందన్నారు.
- తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్, పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ.. ఎవరు ఎంత కష్టపడినా ప్రజలకు మంచి చేయటంతోపాటు మన భవిష్యత్తు కోసమేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, పార్టీ అధ్యాపక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

8న ఏకపాత్రాభినయం, పాటల పోటీలు



తెనాలి: సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 8న గుంటూరులో యువతకు పాటలు, ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహించనున్నారు. గుంటూరు కొత్తపేటలోగల మల్లయ్యలింగం భవన్లో ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు ఉంటాయని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు వెల్లడించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన కళాకారుల సమావేశంలో వారు మాట్లాడారు. అభ్యుదయ, దేశభక్తి, జానపద గీతాల్లో పోటీలుంటాయని, ఏకపాత్రాభినయంలో సామాజిక స్పృహతో కూడిన వాటికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మం మాట్లాడుతూ సమాజ చైతన్యానికి ఇలాంటి పోటీలు దోహద పడతాయని, యువత పాల్గొనాలని కోరారు.

200 రోజుల యాక్షన్ ప్లాన్‌పై నిరంతర పర్యవేక్షణ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్ : వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లాలో నిర్దేశించిన 200 రోజుల యాక్షన్ ప్లాన్‌పై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. యాక్షన్ ప్లాన్‌పై ఈ నెల రెండో వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నట్లు గుర్తుచేశారు. ఆ సమావేశంలో అప్పటి వరకు నిర్వహించిన అభివృద్ధి పనులను తెలియజేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లాలోని 200 రోజుల యాక్షన్ ప్లాన్‌పై నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు.

పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదగాలి



కొరిటిపాడు(గుంటూరు): ప్రతి ఖాతాదారుడు పెద్ద మొత్తంలో సబ్సిడీ రుణాలు తీసుకొని పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదగాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్‌రెడ్డి కోరారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఖాతాదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్ష వంటి ఇన్సూరెన్స్ పథకాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, బ్యాంకులలో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని తెలిపారు. పరిశ్రమలు స్థాపించి ఇంకొకరికి ఉద్యోగం ఇచ్చే స్థాయికి రావాలని, అందరూ బీమా పాలసీలు ఉపయోగించుకోవాలని కోరారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని, రిజర్వు బ్యాంక్ సేవలు మారుమూల గ్రామాల్లోని ప్రజలందరికీ చేరాలన్నారు. కన్నావారితోట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ మన ఓటీపీలను ఎవ్వరికీ చెప్పకూడదన్నారు. పలు సంస్థలు, బ్యాంకుల ప్రతినిధులు రవిప్రదీప్, కె.వెంకటేశ్వరరావు, సయ్యద్ అహ్మద్, షేక్ బాజీ, మంగయ్య, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల విజేత మంగుళూరు వర్సిటీ



చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న మంగుళూరు యూనివర్సిటీ జట్టు



రెండవ స్థానంలో నిలిచిన తిరువల్లువర్ వర్సిటీ జట్టు

రెండవ స్థానంలో నిలిచిన తిరువల్లువర్ విశ్వవిద్యాలయం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్, వెస్ట్ జోన్ పురుషుల అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ మంగళవారం ముగిసింది. టీం చాంపియన్‌షిప్‌ను మంగుళూరు యూనివర్సిటీ కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో తిరువల్లువర్ యూనివర్సిటీ నిలువగా, సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ మూడవ స్థానంలో నిలిచింది. వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ వెల్లడించారు. విజేతలకు ఏఎన్‌యూ వీసీ ఆచార్య కే గంగాధర రావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బి.రవి నాయుడు, టెక్నికల్ కమిటీ చైర్మన్ బడేటి వెంకటరామయ్య, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య పి. జాన్సన్, ఆచార్య ప్రమీలారాణి, ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డిల్షాబాబు, అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం. వి. మాణిక్యాలరావు తదితరులు ట్రోఫీలు అందజేశారు.



బెస్ట్ లిఫ్టర్‌గా నిలిచిన ధనుష్ కుమార్

విజేతలు వీరే...

- 109 కేజీల విభాగంలో మంగుళూరు వర్సిటీ వెయిట్ లిఫ్టర్ ప్రత్యూష్, జై నారాయణ వ్యాస్ వర్సిటీ లిఫ్టర్ వినోద్ లఖానీ, వర్సిటీ ఆఫ్ కాలికట్ లిఫ్టర్ అమల్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు.
- ప్లస్ 109 కేజీల విభాగంలో మహారాజ గంగా సింగ్ వర్సిటీ లిఫ్టర్ కేశవ్ బిస్సా, మంగుళూరు యూనివర్సిటీ లిఫ్టర్ జోష్వా రాజకుమార్, యోగి వేమన యూనివర్సిటీ లిఫ్టర్ గోగులోతు రాజశేఖర్ తొలి మూడు పతకాలు కైవసం చేసుకున్నారు.

ఎక్సైజ్ పోలీసుల అత్యుత్సాహంతో వృద్ధుడికి గుండెపోటు

- కేసు పెట్టి సబ్ జైలుకు పంపుతామని చెప్పడంతో షాక్‌కు గురి
- వెంటనే ఆసుపత్రిలో చేర్పించిన గుంటూరు 2 ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు
- కేసేమీ లేదని చెప్పి ఆసుపత్రి ఖర్చులు కూడా భరించేందుకు హామీ
- ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాళునాయక్

నెహ్రూనగర్: ఎక్సైజ్ పోలీసుల అత్యుత్సాహంతో ఓ వృద్ధుడు గుండెపోటుతో ఆసుపత్రి పాలైన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్ సుగాలి కాలనీ రెండవ లైన్‌కు చెందిన వడిత్య కాళు నాయక్ (76)కి మద్యం తాగే అలవాటు ఉంది. ప్రతి నెల వచ్చే పింఛను సొమ్ముతో ప్రతి సారి బయటికి వెళ్లి మద్యం బాటిళ్లు కొనుగోలు చేయకుండా నెలకు సరిపడా కొనుక్కొని ఇంట్లోనే తాగుతుంటాడు. ఈ క్రమంలో సదరు వృద్ధుడు మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడనే నెపంతో స్థానికంగా కొంత మంది అక్కడి ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం కాళునాయక్‌ను అరెస్ట్ చేసి గుంటూరు 2 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు వృద్ధుడిని స్టేషన్‌లో ఉంచారు. కేసు పెట్టి సబ్ జైలుకు తరలిస్తామని బెదిరించడంతో ఆయన గుండెపోటుకు గురై స్టేషన్‌లోనే పడిపోయాడు. వెంటనే స్టేషన్ సిబ్బంది, కుటుంబ సభ్యులు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఏమైనా జరిగితే ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందో అని ఎక్సైజ్ సిబ్బంది ఆందోళన చెందారు. కేసు లేదని, అవసరమైతే ఆసుపత్రి ఖర్చులు కూడా తామే భరిస్తామని ఎక్సైజ్ పోలీసులు తమతో చెప్పినట్లు కాళునాయక్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తామంటే గిట్టని వారు మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు చేయగానే వృద్ధుడని కూడా చూడకుండా అరెస్టు చేసి స్టేషన్‌లో సాయంత్రం వరకు ఉంచి బెదిరించారని ఆరోపించారు. ఆ కారణంగానే కాళునాయక్‌కు గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు.

గుడిసెల కూల్చివేతపై నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఏర్పాటు చేసుకున్న గుడిసెలు కూల్చివేతపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ ఆధ్వర్యంలో మంగళవారం దీక్షా శిబిరం నుంచి తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇచ్చేంత వరకు కదిలేది లేదని భైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కోటేశ్వరరావు, కె. ఆదినారాయణ, నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు చట్టాలను ఉల్లంఘించారని ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, వైఎస్సార్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ నాయకులు కార్మికులకు మద్దతు ఇచ్చారని తెలిపారు. బకాయిలైనా చెల్లించాలని, లేకుంటే అందుకు సరిపడా భూమినైనా ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. పరిహారం ఇవ్వకపోగా పాకలు కూల్చివేయడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి ప్రతాలు అందజేశారు. కార్మికుల పాకలు కూల్చివేత విషయం తమకు తెలియదని తాడేపల్లి ఎమ్మార్వో కార్యాలయ సూపరింటెండెంట్ చెప్పారు. వీఆర్‌వో ఇ.ఈన్నయ్య పోలీసులు పిలిస్తే వెళ్లారని, ఎంటీఎంసీ కమిషనర్‌కు సమస్య తెలుసునని పేర్కొన్నారు. తమకు ఇందులో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇకపై తాము భూముల విషయంపై జోక్యం చేసుకోబోమని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు తమ ఆందోళనను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్ రావు, రూరల్ కార్యదర్శి పల్లె కృష్ణ, ఆశీర్వాదం, బి. అంకయ్య, సాంబశివరావు, యెహోషువా, బాషా, రమాదేవి, శారద, శివమ్మ, సామ్రాజ్యం, ఎస్‌కె ఆరిఫ్, ఇమాంబి, దుర్గ, నాని, సుబ్బారావు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే దీక్షలు....

ఫ్యాక్టరీ కార్మికులు తమ కార్యాచరణను ప్రకటించారు. బుధవారం నుంచి రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం దీక్షా శిబిరం నుంచి మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని పేర్కొన్నారు. గుడిసెలు ఎందుకు కూల్చివేశారో కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర చోరుడు అరెస్టు

- తక్కువ సమయంలో కేసు ఛేదించిన పోలీసులు
- వివిధ జిల్లాల్లో చోరీ చేసిన సొత్తు రూ.18.48 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన చీరాల డీఎస్పీ మొయిన్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

అద్దంకి: అంత రాష్ట్ర దొంగను పట్టుకొని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఇటీవల అద్దంకి పట్టణంలోని పోతురాజు గండిలోని శ్రీసాయిరామ్ ఏజెన్సీస్ దుకాణంలో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చీరాల డీఎస్పీ మొయిన్ విలేకర్ల సమావేశం నిర్వహించి కేసుల వివరాలు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన సాయి సూర్యతేజ చిన్న వయసు నుంచే చిన్న చిన్న దొంగనాలు చేసేవాడు. చెడు వ్యసనాలకు అలవాటుపడి గ్యారేజీల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలు చేస్తుండేవాడు. సూర్యతేజ గుంటూరు నగరంలోని స్వర్ణభారతినగర్‌కు చెందిన బెల్లంకొండ విజయ్‌కృష్ణతో కలసి గత నెల 25వ తేదీ అద్దంకిలోని శ్రీరామ్ ఏజెన్సీలో రాత్రి సమయంలో షట్టర్ పగులగొట్టి గల్లా పెట్టెలో ఉన్న రూ.15.30 లక్షల నగదు చోరీ చేశాడు. దుకాణ యజమాని గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడిని అతి తక్కువ సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అతి తక్కువ సమయంలో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి అద్దంకితోపాటు వివిధ జిల్లాల్లో 8 కేసులకు సబంధించిన రూ. 18.48 లక్షలు సొత్తు రికవరీ చేశారు. మంగళవారం అద్దంకి సమీపంలోని కొంగపాడు డొంక వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

సిబ్బందికి రివార్డు

నిందితులను చాకచక్యంగా పట్టుకున్న డీఎస్పీ మొయిన్, సీసీఎస్ డీఎస్పీ జగదీశ్ నాయక్, అద్దంకి సీఐ కృష్ణయ్య, సీసీఎస్ ఎస్సై ప్రేమయ్య, అద్దంకి ఎస్సై ఖాదర్‌బాషా, చీరాల ఎస్సై కమలాకర్, జే పంగులూరు ఎస్సైతోపాటు వివిధ స్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సై బాజీ, బృందంలోని పోలీసులను ఎస్పీ తుషార్ డూడీ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

పటిష్ట బందోబస్తు

పట్టణంలో నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో సీసీఎస్ బృందాలతోపాటు పోలీసు బృందాలు గస్తీ తిరుగుతూ అనుమానితుల ఇళ్ల సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించి కొత్త వారు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ కోరారు.

రిటైర్డ్ ప్రొఫెసర్‌కు సైబర్ వల

- రూ.74 లక్షలు మాయం
- పోలీసులకు ఫిర్యాదు

చుండూరు(వేమూరు): చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ గొంది లక్ష్మీహరివరప్రసాద్‌ను సైబర్ నేరస్తులు మోసం చేసి వారి అకౌంట్‌లో రూ.74 లక్షలు జమ చేయించుకున్నట్లు ఎస్ఐ షేక్ రహమాన్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు..చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన గొంది లక్ష్మీహరి వరప్రసాద్ కేరళ రాష్ట్రంలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. రిటైర్ అయిన తర్వాత స్వగ్రామమైన వేటపాలెంలో నివాసం ఉంటున్నాడు. సైబర్ నేరస్తులు ఫోన్ చేసి మీ అకౌంట్‌లో రూ.6 కోట్లు జమ అయ్యాయని, మనీ లాండ్రింగ్ కింద కేసు నమోదైందని, సుప్రీంకోర్టులో కేసు ఉంది, కేసు మాఫీ చేయాలంటే మా అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని కోరారు. దీంతో ఆయన భయపడి వారి అకౌంట్‌కు రూ.74 లక్షలు పంపించాడు. మరలా ఫోన్ చేసిన రూ.30 లక్షలు అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. అనుమానం రావడంతో ఆయన విదేశాలలో ఉంటున్న తన కుమార్తెకు విషయం తెలియజేశాడు. వెంటనే కేసు పెట్టమని ఆమె సూచించడంతో చుండూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సైబర్ నేరస్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ రహిమాన్ తెలిపారు.

ఏఎన్‌యూ ఆచార్యుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

గుంటూరు : తమ విభాగ ఆచార్యుడు తనను లైంగిక వేధింపులకు గురి చేయడంతోపాటు ప్రాణహాని కలిగిస్తున్నారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న పి.దుర్గాలక్ష్మి ఆరోపించారు. ఈ మేరకు గుంటూరు జిల్లా ఎస్పీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు... ఇటీవల తనను కారుతో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్యుడు పాల్‌కుమార్, ఆయన వద్ద పరిశోధకుడు కె. ప్రసన్నకుమార్ కారుతో ఢీకొట్టారని ఆరోపించారు. అంతకుముందు వీరి కారణంగా తాను ఇబ్బందులు పడ్డానని పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కంకర కుప్పను బైకు ఢీకొని యువకుడి మృతి

ఒకరికి తీవ్రగాయాలు, మరో ఇద్దరికి స్వల్పగాయాలు



ప్రమాద స్థలిలో కల్యాణ్‌రామ్ మృతదేహం

వేటపాలెం: రోడ్డుకు అడ్డుగా పోసిన కంకర కుప్పను బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం దగ్గరలోని క్రిస్టల్ విల్లాస్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన నలుగురు యువకులు రెండు బైక్‌లపై పొట్టి సుబ్బయ్యపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి కావడంతో వేగంగా వస్తున్న బైక్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డుపై ఉన్న కంకర కుప్పను ఢీకొంది. బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఇందులో యర్రవరపు కల్యాణ్‌రామ్ (20) అక్కడికక్కడే మృత్యువాత పడగా, కంచర్ల వెంకట మనోజ్ తీవ్రగాయాల పాలయ్యాడు. వీరి వెంటే వస్తున్న మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై భవన నిర్మాణ మెటీరియల్ వేయడంతో రాత్రి వేళల్లో ద్విచక్రవానాలకు ప్రమాదకరంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో భవన నిర్మాణ మెటీరియల్‌ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బెయిల్ పిటిషన్ వాయిదా

నగరంపాలెం: జీజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ ప్రభావతి బెయిల్ పిటిషన్ వాయిదా వేశారు. గతంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నగరంపాలెం పీఎస్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమె తరఫున మంగళవారం రెండో అదనపు జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను రెండో అదనపు జిల్లా జడ్జి ఈ నెల తొమ్మిదికి వాయిదా వేశారు.